రాలీలో ఎమ్మెల్సీ దయానంద్

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి

ఎల్బీనగర్, మార్చి 24: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తెలిపారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా నవభారతి నిర్మాణం ఫౌండేషన్, స్వప్న హాస్పిటల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్షయ వ్యాధి నివారణ అవగాహన శిబిరం, ర్యాలీలో ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ రాబర్డ్ కోచ్ క్షయ వ్యాధిని గుర్తించడానికి సూక్ష్మజీవులను మొట్టమొదలు 24 మార్చి 1882లో గుర్తించినట్లు తెలిపారు. ఇందుకు గాను డాక్టర్ రాబర్డ్ కోచ్‌కు 1905లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయడం జరిగిందని గుర్తు చేశారు. నాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంగా జరుపుకోవడం ప్రారంభమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ స్వప్న హాస్పిటల్ డాక్టర్ ఎం.స్వప్న కుమారి, నవభారతి నిర్మాణ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల హేమంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రిశీ, శిరీష, ఉదయ రంజిని స్మిత సౌమ్య పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని సన్మానిస్తున్న జీఎస్ఐ గేటు సమీపంలోని మహవీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 24: నాగోల్ డివిజన్ పరిధి జీఎస్ఐ గేటు సమీపంలోని మహవీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఇటీవల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు. వాకర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. యోగా షెడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మహవీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో త్వరలో మార్నింగ్ వాక్ చేపట్టి వాకర్స్ సమస్యలను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. మార్నింగ్, ఈవినింగ్ వాక్‌కు వచ్చే వాకర్స్ కోసం యోగా షెడ్డుతో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు పోచబోయిన జగదీశ్‌యాదవ్, నర్సింహులు, రమేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులు జగన్మోహన్‌రెడ్డి, విశ్వనాథ్, కార్యవర్గసభ్యులు శంకర్, కృష్ణ, కొలను శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కందుకూరు, మార్చి 24 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బైరాగిగూడ గ్రామానికి చెందిన ఎలి మనేటి మంగమ్మకు మంజూరైన రూ.54వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, ఎంపీటీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని చాణక్యపురి కాలనీలో నీటి సంరక్షణపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మన్సూరాబాద్, మార్చి 24: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ పరిధి చాణక్యపురికాలనీలో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ సహకారంతో నీటి సంరక్షణ, వినియోగం అనే అంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో ర్యాలీ నిర్వహించి ఇంకుడు గుంతల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. నీటి సంరక్షణపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇంకుడు గుంతల స్పెషల్ ఆఫీసర్ జల సత్యనారాయణ మాట్లాడుతూ.. గత సంవత్సరం వర్షపాతం తక్కువగా నమోదు కావడం వలన ఈ వేసవిలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతిఒక్కరూ విధిగా తమ ఇంటి పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలు వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్చన, శ్రీధర్‌బాబు, హసూబు, ఎస్. నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, యాకుత్‌పురా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట్ల లడ్డు పటేల్.
– సైదాబాద్, మార్చి 24

జల్‌పల్లిలోని శ్రీహర్ష టెక్నో స్కూల్ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మినారాయణ, శంకర్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.
– పహాడీషరీఫ్, మార్చి 24

చంద్రపురికాలనీలో పెండింగ్ పనులను పూర్తిచేస్తా..

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న చంద్రపురికాలనీ నూతన కార్యవర్గసభ్యులు

మన్సూరాబాద్, మార్చి 24: మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురికాలనీ నూతన కార్యవర్గసభ్యులు ఆదివారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చంద్రపురికాలనీలో అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీవాసుల కోసం ఓపెన్‌జిమ్‌ను మంజూరు చేయించడం జరిగిందని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా..

ఆర్కేపురం, మార్చి 24 : రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, అమ్మ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నీలోఫర్ ఎంఎన్‌జీ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ మాట్లాడుతూ.. పేద ప్రజల సేవే లక్ష్యంగా రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ముందుకెళ్తుందన్నారు. ప్రతి ఆదివారం ప్రభుత్వ హాస్పిటల్ వద్ద అన్నదాన కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిరీష, ప్రకాశ్ యాదవ్, చైతన్య, ప్రశాంత్, రామయ్య, మల్లికార్జున్, శ్రీనాథ్, ముత్యాలమ్మ, దేవి, చందు తదితరులు ఉన్నారు.

నీలోఫర్ ఎంఎన్‌జీ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద అన్నదానం నిర్వహిస్తున్న పెద్ది శంకర్ తదితరులు

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

చంపాపేట, మార్చి 24: బీఆర్ఎస్ నేత, కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్ష్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి రఘుమారెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. రఘుమారెడ్డితో పాటు హనుమాన్ ఆలయ మాజీ డైరెక్టర్ సామ రంగారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, విక్రమ్, విజేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాటి కాపరులను ఆదుకోవాలి

కందుకూరు, మార్చి 24: తెలంగాణ ప్రభుత్వం కాటి కాపరులను ఆదుకోవాలని బ్యాగరి కాటికాపరులు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవులు కోరారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని వనతిపత్రం అందజేశారు. హెల్త్ కార్డులు, రూ.10లక్షల జీవిత బీమా, నెలసరి వేతనం రూ.25వేలు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎన్నో ఏండ్లనుంచి తక్కువ వేతనాలకు సమాజసేవ చేస్తున్నామని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. తమ వృత్తి పరంగా శ్మశానంలో ఖననం చేసే సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూనే తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో తమ శ్రమకు గుర్తింపు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అన్ని పార్టీలు తమ శ్రమకు తగిన వేతనాలతో పాటు గుర్తింపునివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గాదె సత్తయ్య, శేఖర్, నాగేశ్, నాగరాజు, సుధాకర్, రాజు, నర్సింహ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మల్లు రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాటి కాపరులు

రోడ్డు కబ్జాపై రగడ..

- రెండు కాలనీల సరిహద్దు రోడ్డు వివాదం
- ఒకరిపై ఒకరు ఫిర్యాదులు
- సమస్యను పరిష్కరించని టౌన్ ప్లానింగ్ అధికారులు

బడంగ్‌పేట, మార్చి24: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ 27వ డివిజన్ పరిధిలోని టెలికాం కాలనీ, బాజీనారాయణ కాలనీ సరిహద్దులో ఉన్న రోడ్డును కబ్జా చేస్తున్న అంశం మూడు నెలల నుంచి నడుస్తోంది. శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద 36 గజాల స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్లు ఉన్నాయి. అక్కడ రోడ్డు 50 గజాలు ఉంది. శ్రీనివాస్ 36 గజాలకు బదులు రోడ్డును కబ్జా చేసి 80 గజాలు చేసిన్నట్లు స్థానిక కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. రోడ్డును కబ్జా చేయకుండా నీ డాక్యూమెంట్ ప్రకారం నిర్మాణం చేసుకోవాలని చెప్పడం జరిగిందన్నారు. రోడ్డును కబ్జా చేస్తున్నట్లు శివరాంరెడ్డి కార్పొరేటర్ శ్రీధర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. కొంత కాలం నుంచి ఈ మస్య రగులుతూనే ఉంది. రెండు రోజుల నుంచి శ్రీనివాస్ రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేస్తుండటంతో సమస్య మొదటికి వచ్చింది. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. శివరాం రెడ్డి సీలింగ్ భూమిలో నిర్మాణం చేసిన్నట్లు శ్రీనివాస్ ఫిర్యాదు చేస్తున్నాడు. శ్రీనివాస్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి అండదండలతో కబ్జా చేస్తున్నాడని శివరాంరెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ విషయం పలుమార్లు తన దృష్టికి తీసుకొచ్చారని కార్పొరేటర్ శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రోడ్డును కబ్జా కానివ్వమని శ్రీధర్ రెడ్డి పేర్కొంటున్నారు. రోడ్డు కబ్జా అంశం తనకు సంబంధం లేదని కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి స్పష్టం చేస్తున్నారు. నా డివిజన్ కాదు.. నాకు సబంధం లేదు.. అని రాంరెడ్డి చెబుతున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు తీసుకునే నిర్ణయాన్ని బట్టే ఈ సమస్యకు ముగింపు దొరుకుంది.

వనమైసమ్మ దేవాలయ వార్షికోత్సవాలు

మన్సూరాబాద్, మార్చి 24: నాగోల్ డివిజన్ బండ్లగూడలోని శ్రీ కంఠమహేశ్వర శివ పంచాయతన వనమైసమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్య అతిథిగా హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ.. శ్రీ కంఠమహేశ్వర శివ పంచాయతన వనమైసమ్మ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెరుకు జంగయ్యగౌడ్, సభ్యులు మెట్టు శంకరయ్య గౌడ్, రుద్రగోని పాండుగౌడ్, భవానీశంకర్ గౌడ్, లక్ష్మీబాయిగౌడ్, సుర్వి ప్రమీలగౌడ్, చెరుకు బాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహిల్స్ కాలనీ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్ గౌడ్

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): అల్మాస్‌గూడ శ్రీహిల్స్‌కాలనీ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్ గౌడ్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీహిల్స్ కాలనీ ఫేజ్-2 ఉమ్మడి క్యార్యదర్శి జెల్లా రమేశ్ బోయపల్లి ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సైదాబాద్, మార్చి 24: ఇంట్రా స్కూల్ పెయింటింగ్ పోటీల్లో సైదాబాద్ కరణ్‌బాగ్ కాలనీ కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి నగరస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం నగరంలోని నివేదిత పాఠశాలలో జేఎస్‌డబ్ల్యూ పెయింటింగ్, ది హిందూ యంగ్ వరల్డ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో జి.ధైత్యనాయుడు, సీహెచ్ హారిక, జూనియర్స్ విభాగంలో డి.నిక్షేత చక్కటి ప్రతిభ కనబర్చి నగర స్థాయి పోటీలకు ఎంపిక కావటంతో నిర్వాహకులు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. నగర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కె.శంతన్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ఝూన్సీ అభినందించారు.

పెయింటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు

గోశాలలో దారుణం

- మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో గోవు మృతి
- నాలుగు ఆవుల అపహరణ

మన్సూరాబాద్/వనస్థలిపురం, మార్చి 24: మన్సూరాబాద్ డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లోని శివాలయం వద్ద గోశాలలో దారుణం చోటు చేసుకుంది. శివాలయం ఆవరణలో కొన్నేండ్లుగా గోశాలను నిర్వహిస్తున్నారు. గోశాలలో ఏడు గోవులతో పాటు రెండు లేగ దూడలున్నాయి. శనివారం సాయంత్రం వరకు గోవుల సంరక్షణను చూసుకున్న నిర్వాహకులు రాత్రి ఇంటికి వెళ్లారు. రాత్రి వరకు గోవులు ఎంతో హుషారుగానే ఉన్నాయి. ఆదివారం తెల్లవారే సరికి దారుణం చోటు చేసుకుంది. నాలుగు గోవులు కనిపించకుండా పోగా.. మరో గోవు మృతి చెంది ఉంది. రెండు గోవులు.. లేగ దూడలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. ఉదయాన్నే గోశాల చేరుకున్న నిర్వాహకులు పరిస్థితిని గమనించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రెండు గోవులు, లేగ దూడలకు చికిత్స అందజేసి రక్షించారు. మత్తు ఇంజక్షన్ ఇవ్వడం కారణంగానే గోవు మృతి చెందిందని, రెండు గోవులు, రెండు లేగ దూడలు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాయని గోశాల నిర్వాహకులు ఆరోపించారు. అపహరణకు గురైన నాలుగు గోవులను కాపాడాలని.. ఇంతటి దారుణానికి కారకులైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ విషయంపై గోశాల నిర్వాహకులు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు చేపడుతామని తెలిపారు.

నిందితులను గుర్తించాలి

మత్తు మందు ఇచ్చి గోవు మృతికి కారకులైన నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. జడ్జెస్‌కాలనీ ఫేజ్-1 శివాలయం ఆవరణలో గోశాలను ఆదివారం సందర్శించి మృతి చెందిన గోవును పరిశీలించారు. సీసీటీవీ కెమెరాల్లో ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అపహరించుకుపోయిన గోవులను రక్షించాలని.. మరో గోవు మృతికి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఎల్బీనగర్, మార్చి 24: తెలంగాణ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేంనాథ్‌గౌడ్, కుమ్మర సంఘం రాష్ట్ర నాయకుడు మల్కాజిగిరి దయానంద్, గడ్డిఅన్నారం పార్టీ సీనియర్ నాయకుడు జి.బాలగౌడ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ కమిటీ డైరెక్టర్ బబ్బురి ఆనంద్‌కుమార్ గౌడ్, సీనియర్ నాయకుడు కందికంటి శ్రీధర్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

కందుకూరు, మార్చి 24: యువకులు క్రీడల్లో రాణించాలని అగర్‌మియగూడ మాజీ ఉప సర్పంచ్ వడ్డెపల్లి రేవంత్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో యువకులు నిర్వహిస్తున్న ఏపీఎల్ క్రికెట్ పోటీలను ఆయన టాస్‌వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు యువకులు లిక్కి జంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రవి, సంతోష్ రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, అజయ్‌యాదవ్, వినేశ్, తరుణ్, శ్రీను, నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

అగర్‌మియగూడలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఉప సర్పంచ్ వడ్డెపల్లి రేవంత్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి

మహిళా సదస్సులో మాట్లాడుతున్న ఈటల జమున

ఎల్బీనగర్, మార్చి 24: పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున తెలిపారు. గడ్డిఅన్నారం డివిజన్ సరస్వతి నగర్ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన బీజేపీ మహిళా ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీకి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి, బండి నిర్మల, చిలుకూరి రాంరెడ్డి, ఆనంద్, దాసరి జయప్రకాశ్‌తో పాటు పెద్ద సంఖ్యలో మహిళా నాయకులు పాల్గొన్నారు.